క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


ఎస్ఐ షేక్ శంకర్

వంగర: పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా షేక్ శంకర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పని చేసిన వైవీ జనార్దన్ వేరే చోటకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఈయన రావడం జరిగింది. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఎస్ఐ శంకర్ తెలిపారు.

సీఐగా సతీష్‌కుమార్

బొబ్బిలి: సీఐగా కె.సతీష్‌కుమార్ నియమితులయ్యారు. విశాఖపట్నం మెరైన్ సీఐగా పనిచేస్తున్న ఆయన గతంలో ఇక్కడ ఎస్ఐగా పని చేశారు. మళ్లీ ఇప్పుడు సీఐగా వస్తుండగా, మరో రెండు రోజుల్లో విధుల్లో చేరుతారని స్టేషన్ వర్గాలు తెలిపాయి.

చురుగ్గా ఈ-క్రాప్ నమోదు


ఉప్పర్నాయుడువలసలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వండానపేట, మజ్జిరాముడుపేట, అప్పాపురం తదితర గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు చాలా చురుగ్గా జరుగుతోంది. రైతులంతా రైతు సేవా కేంద్రాల వద్దకు చేరుకుని, తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా వారికి ఈ-క్రాప్ నమోదు ప్రయోజనాలను సిబ్బంది వివరిస్తున్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే ఏదైనా ప్రకృతి విపత్తు కారణంగా పంటనష్టం జరిగితే నష్టపరిహారం వచ్చే అవకాశం ఉంటుందని సిబ్బంది తెలిపారు.

సస్యరక్షణ చేపట్టాలి


బూరాడలో మొక్కజొన్న పంట పరిశీలనలో ఏవో మురళీకృష్ణ

రేగిడి: మొక్కజొన్న సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో జి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని బూరాడ, తోకలవలస, లక్ష్మణవలస తదితర గ్రామాల్లో పండిస్తున్న మొక్కజొన్న పంటను ఆయన ఆదివారం పరిశీలించారు. ప్రస్తుతం పంటను కత్తెర పురుగు ఆశిస్తోందని, నివారణకు పురుగుమందు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు రాఖీ వేడుకలు


అనాథ చిన్నారులతో బ్రహ్మకుమారీలు

బొబ్బిలి: పట్టణంలోని అనాథ ఆశ్రమంలో పట్టణానికి చెందిన ఓంశాంతి మందిరం బ్రహ్మకుమారీలు ముందస్తు రాఖీ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆశ్రమంలోని అనాథ పిల్లలందరికీ రాఖీలు కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బొబ్బిలి ఓంశాంతి మందిరం ఇన్‌చార్జి బీకే రాజేశ్వరి, ఆశ్రమ కో–ఆర్డినేటర్ కె.జయబాబు, తిరుమల సత్యదేవి, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం


హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో సుదర్శన హోమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకాలు పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో అర్చకులు సత్తె నరసింహాచార్యులు భక్తులతో హోమం జరిపించారు. ఈ హోమం చేయడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

గుర్రపుడెక్కను తొలగించండి

సంతకవిటి: మండలంలోని రంగారాయపురం వద్ద నారాయణపురం ఆనకట్ట నుంచి ప్రారంభమైన కుడి ప్రధాన కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు. విపరీతంగా పెరిగిన గుర్రపుడెక్క కారణంగా సాగునీరు అంతగా ప్రవహించకపోవడంతో పాటు గుర్రపుడెక్క అలాగే ఉండిపోవడంతో గట్టుకు గండి ఏర్పడి తమ పంటలు నాశనమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, వరదనీరు రాకముందే గుర్రపుడెక్క తొలగించాలని అభ్యర్థిస్తున్నారు.

● వినూత్నంగా వృక్షాబంధన్



బొబ్బిలి మండలం, అలజంగి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వినూత్నంగా వృక్షాబంధన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వృక్షాలను రక్షించి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిస్తూ వారు చెట్లకు రాఖీలు కట్టిన తీరు ప్రజలను ఆలోచింపజేస్తోంది. సోమవారం రక్షాబంధన్ పండగ పురస్కరించుకుని, పర్యావరణ హితమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయుడు యజ్జల మోజేష్ తెలిపారు.

-బొబ్బిలిరూరల్

● కొలువుదీరేందుకు సిద్ధం

వినాయక చవితి దగ్గర పడుతుండడంతో మండపాల్లో కొలువుదీరేందుకు బొజ్జ గణపయ్య సిద్ధమవుతున్నాడు. రామభద్రపురం మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు ఆనుకుని ఉన్న సత్యసాయిబాబా ఆలయం పక్కన ఈశ్వరాలయం దగ్గర గణేశుని ప్రతిమలు తయారవుతున్నాయి. రాజస్థాన్, సాలూరుకు చెందిన పలువురు కళాకారులు ప్రతిఏటా ఇక్కడే పెద్దఎత్తున విగ్రహాలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం రంగులద్దుకున్న కొన్ని విగ్రహాలను అమ్మకానికి సిద్ధం చేశారు. కొన్ని ప్రాంతాల వారు ఇప్పటినుంచే వాటిని కొనుగోలు చేస్తుండగా, మరికొంత మంది ఆర్డర్లు ఇస్తుండడం విశేషం.

-రామభద్రపురం



● రాఖీ పుష్ప రహస్యం



అరుదైన రాఖీ పుష్పం వెనుక దాగి ఉన్న రహస్యాన్ని రామభద్రపురానికి చెందిన ప్రముఖ వేదాంతి డబ్ల్యుఎన్ రాయిలుశర్మ వివరించారు. సోమవారం రాఖీ పండగ సందర్భంగా రాఖీని పోలిన పుష్పాన్ని చూపిస్తూ ఇది మహాభారతాన్ని గుర్తు చేస్తుందని తెలిపారు. పువ్వు చుట్టూ 100 నీలిరంగు పూరేకులు కౌరవులనుకుంటే ఆకుపచ్చ రంగులోని మరో ఐదు పూరేకులు పాండవులని, మధ్యలో పైన ఊదా రంగులోని మరో మూడు పూరేకులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని, ఆ మధ్యలోని చక్రాకృతిని సుదర్శన చక్రంగా చెప్పకోవచ్చన్నారు. ఈ అద్భుతమైన పుష్పం సృష్టి సాక్షాత్తు దేవుని సృష్టేనని చెప్పకోక తప్పదని, దీనినే కౌరవపాండవుల పుష్పంగా, కృష్ణకమలంగా పిలుస్తారన్నారు.

-రామభద్రపురం

పరామర్శ


యువకుడిని పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: మండలంలోని కంచరాం గ్రామానికి చెందిన బూటు తేజ అనే యువకుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై, చికిత్స అనంతరం ఇంటి వద్దనే ప్రస్తుతం కోలుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆదివారం అతడిని కలిసి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, గెడ్డాపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు, ముదిలి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

రేగిడి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట గ్రామాల్లో మాదకద్రవ్యాల నిషేధంపై అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. మద్యం, గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిసలై ఎంతోమంది తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని, యువతీ యువకులంతా చెడువ్యసనాల బారినపడకుండా ఉండి, ఆదర్శవంతమైన జీవితం గడపాలని హితవుపలికారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


అంబకండిలో త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రదర్శిస్తున్న కమిటీ సభ్యులు

రేగిడి: మండలంలోని అంబకండి, సోమరాజుపేట, ఉంగరాడ తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రజలకు పరిచయం చేస్తూ వాటి సారాంశాన్ని వివరిస్తున్నారు. ఆత్మ, పరమాత్మ, జీవాత్మల గురించి తెలుసుకోవడం ద్వారా ధర్మస్థాపన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, సభ్యులు పుండరీకాక్షయ్య, వెంకటరావు, గోపాలకృష్ణ, సూర్యనారాయణ, వాసు, అప్పన్న, ప్రశాంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 50 మంది ఎంపిక


వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని మెంతిపేట సత్యసాయి సుందరం మందిరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్రవైద్య శిబిరంలో 50 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు ఆప్తాల్మిక్ అధికారి జాక్సన్ తెలిపారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 108 మంది శిబిరానికి హాజరై, కంటి పరీక్షలు చేయించుకోగా 50 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు గుర్తించారు. మిగతా వారిలో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు, ఎం.శ్రీనివాసరావు, వెంకటేష్, ఆదినాయుడు, సూర్యారావు, క్యాంపు కో–ఆర్డినేటర్ ఎం.సాయికుమార్ పాల్గొన్నారు.

సంస్కరణలతో పిల్లలు విద్యకు దూరం


విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న యూటీఎఫ్ సభ్యులు

బొబ్బిలి రూరల్: విద్యావిధానంలో తీసుకువచ్చిన పలు సంస్కరణలతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వి.విజయగౌరి అన్నారు. మండలంలోని నిమ్మలపాడు గిరిజన గ్రామంలో యూటీఎఫ్ బృందం ఆదివారం పర్యటించింది. తొలుత గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, అక్కడి 1, 2వ తరగతుల విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇక్కడ 3, 4, 5 తరగతులు ఉండేవని, ప్రస్తుతం ఆ తరగతులు కొనసాగడం లేదన్నారు. దీంతో 3, 4, 5వ తరగతుల విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి, చదువుకోవాల్సి వస్తుందన్నారు. పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు మళ్లీ ఇంటికి వచ్చే వరకు వారి కోసం తల్లిదండ్రులు వేచిచూస్తున్నారు. ఇక్కడి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అదనపు తరగతులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే చదువు భారం కారణంగా కొంతమంది చదువు మానివేసే అవకాశం ఉందన్నారు. సర్పంచ్ వెంగళి మాట్లాడుతూ ఇదే సమస్యను అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. గతంలో ఇదే గ్రామంలో 200 మంది పిల్లల వరకు చదువుకునేవారని, ఇక్కడే హాస్టల్ కూడా ఉండేదని, దానిని మూసివేయడంతో చాలా మంది పిల్లలు విద్యకు దూరమయ్యారని తెలిపారు. 3, 4, 5 తరగతుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు, క్రీడాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో మహేష్, శ్రీనివాస్, కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


కాలువపై ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: పట్టణంలోని మాధవబజార్‌లోని కాలువపై ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు ఆదివారం తొలగించారు. అక్కడి దుకాణదారులంతా కాలువపై ఇష్టారాజ్యంగా కట్టడాలు నిర్మించారు. దీంతో కాలువలోని చెత్త తీయడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా కాలువలోని మురుగు అంతా రోడ్డుపై ప్రవహిస్తుండగా, అటువైపుగా వెళ్తున్న వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో సంబంధిత షాపుల యజమానులతో చర్చించి, ఆక్రమణల తొలగించేందుకు చర్యలు చేపట్టారు. కాలువపై అక్రమంగా ఎటువంటి కట్టడాలు కట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు.

విరాళాల సేకరణ


మాట్లాడుతున్న రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్షుంనాయుడు

బొబ్బిలి: కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం స్థానిక పట్టణంలో విరాళాల సేకరణ ఆదివారం చేపట్టారు. రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు, పి.ఈశ్వరరావు, చుక్క సన్యాసిరావు, రాంబార్కి తిరుపతిరావు, కూర్మినాయుడు, అప్పారావు, శంకరరావు కలిసి దాతలు ఇచ్చిన సొమ్మును పోగుచేయగా రూ.5 వేలు సమకూరిందన్నారు. ఈ నగదును కలెక్టర్ అంబేడ్కర్ చేతులమీదుగా కేరళ పంపించనున్నట్లు తెలిపారు.

రక్తదానంపై అపోహలు వీడాలి


రక్తదానం చేస్తున్న రూరల్ సీఐ ఉపేంద్ర, తదితరులు

రాజాం సిటీ: రక్తదానంపై నెలకొన్న అపోహలు విడనాడాలని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో సినీహీరో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన యువతీ,యువకులంతా ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చని తెలిపారు. రక్తదానం చేస్తే సన్నబడిపోతాం, ఆరోగ్యం క్షీణిస్తుందన్న వాటిని నమ్మవద్దన్నారు. రక్తం దానం చేస్తే ఆరోగ్యమే తప్ప అనర్థం లేదన్నారు. 18 ఏళ్లు నిండిన యువకులు రక్తదానానికి ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, చిరంజీవి అభిమానులు గోక కొండలరావు, కె.జనార్దన, బి.రమణ, వి.శ్రీనివాసరావు, జగదీష్, త్రినాద్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

బొబ్బిలి: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య ఘటనలోని నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, సీఐటీయూ నాయకుడు ఎ.సురేష్ డిమాండ్ చేశారు. ఆ ఘటనను వ్యతిరేకిస్తూ స్థానిక పట్టణంలోని పాకీ వీధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిలబడి ఆదివారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇటువంటి దుర్ఘటనలు ఎక్కువైపోయాయని, మహిళలకు ఏనాడూ రక్షణ లేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి, విచారణను సత్వరం చేసి, నిందితులను పట్టుకుని ఉరితీయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది గౌరీషు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి


విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు పుస్తక పఠనం ప్రయోజనాలు, పుస్తకాలు ఎలా చదవాలో లైబ్రేరియన్ తెలిపారు. పుస్తక పఠనంతో పాటు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్నప్పుడు పాటించాల్సిన మెలకులను ఆయన నేర్పించారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేసుకుంటే అపారమైన జ్ఞానం లభిస్తుందన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో విద్యార్థులంతా చేరాలని, ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి వార్తాపత్రికలు, కథల పుస్తకాలు, కాంపిటేటివ్ పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలు చదవడంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


మొక్కలు నాటుతున్న గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు

బొబ్బిలి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక పట్టణ పరిధిలోని గొల్లపల్లి దాడితల్లి కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఆయన సొసైటీ సభ్యులు కలిసి 100 మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అడవుల శాతం రోజురోజుకూ తగ్గిపోవడంతో వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోత విపరీతంగా ఉంటోందన్నారు. అందరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు ఆర్.కిరణ్‌కుమార్, రవికిరణ్, సీహెచ్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు


ఆమిటిలో సాగు చేస్తున్న మొక్కజొన్న

తెర్లాం: మెట్టుభూముల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పంట ఏపుగా పెరిగి మొక్కజొన్న కండెలు వేస్తున్నాయి. మండలంలోని మొత్తం 33 గ్రామ పంచాయతీల్లో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను పండిస్తున్నారు. కొరటాం, ఆమిటి, గొలుగువలస, అప్పలంపేట, బూరిపేట, ఎన్.బూర్జవలస, సుందరాడ, ఉద్దవోలు, కవిరాయునివలస, లోచర్ల తదితర గ్రామాల్లోని రైతులు ఎక్కువగా పంటను సాగుచేస్తున్నారు. గతంలో ఇదే రైతులు మెట్టుభూముల్లో పత్తి పంటను సాగుచేసేవారు. ప్రకృతి వైపరీత్యాలకు పత్తిపంట నాశనం అవుతుండడంతో పాటు పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో ఆ పంట స్థానంలో మొక్కజొన్న పంటను వేస్తున్నారు. క్వింటా మొక్కజొన్న పంట రూ.1600 నుంచి రూ.2 వేలు వరకు ధర పలుకుతుండడంతో రైతులు ఈ పంట సాగుపై దృష్టి సారించారు. అన్నిచోట్ల పండిస్తున్న మొక్కజొన్న పంట ఈ ఏడాది అధిక దిగుబడులు వచ్చేలా కనిపిస్తున్నాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన


రాజాం: పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో చేపట్టిన పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్‌లు ఆదివారం పరిశీలిచారు. బొబ్బిలి రోడ్డుతో పాటు మెంతిపేట ఎస్సీ కాలనీ, గాయత్రి కాలనీ, తాణా వీధుల్లో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలపై ఆరాతీశారు. ప్రతిరోజూ పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ చేపట్టి, ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించాలని సూచించారు. అనంతరం ఆయా వార్డుల్లోని ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య సూత్రాలు చెబుతున్నారు.

రేగిడి: మండలంలోని మునకలవలస, బాలకవివలస, వన్నలి, సోమరాజుపేట, సంకిలి గ్రామాల్లో పారిశుధ్య పనులు ఆదివారం చేపట్టారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు.